
# గుండె తలుపు

*సుప్రభాతం వీక్లీ.. 23 ఫిబ్రవరి, 2002*



ఈ రోజు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో అమ్మ వస్తోందంటే చాలా ఆనందంగా ఉంది. బరువెక్కిన హృదయం సేదదీరుతున్నట్లనిపిస్తోంది.

'నా ఈ నలభై సంవత్సరాల జీవితంలో మానసికంగా అలసిన ప్రతిసారీ- అమ్మ అమృతప్రాయమైన ప్రేమను చిలికించి సేదదీర్చేది.

మంచి మనసుకు ప్రతిబింబం మా అమ్మ. మానవతకు ప్రతినిధి మా జనని. ఎన్నోసార్లు సమస్యల సుడిగుండంలో పడి ఊపిరాడక కొట్టుమిట్టాడుతుంటే చిన్నఉపాయంతో సమస్యని చెల్లాచెదురు చేసి పడేసేది.

చిరునగవుతో ఎప్పుడూ స్వాగతం పలికే ఆవిడ- కోపానికి బద్ధవిరోధి. సంతోషం పదిమందికీ పంచేది. మౌనవ్యధ తానొక్కతే భరించేది. పెద్దగా చదువుసంధ్యలు లేకపోయినా ఆమె విశిష్ట వ్యక్తిత్వంతో అందరికీ ఆదర్శంగా నిలిచేది.

ఈ జీవితగమనంలో మనగలగాలంటే... చదువుసంధ్యలు ఒక్కటే ముఖ్యంకాదు. చదువుకోకపోయినా సంస్కారంతో తనలోని అహాన్ని అణచివేయగల నేర్పు మనిషిలోని 'మనిషి'ని ఆవిష్కరిస్తుంది. అలరించే ఆప్యాయత, శోభించే వ్యక్తిత్వాలను నరనరాలలో జీర్ణించుకున్న అమ్మను అందరూ కీర్తిస్తుంటే... ఆమె గర్భవాసాన జన్మించడం ఎంతో అదృష్టంగా భావించేవాణ్ణి.

ఆవిడను చూస్తే అబద్ధం, అధర్మం వేయి మైళ్లు అవతలకి పారిపోయేవి. అది అమ్మ ప్రత్యేకత! ఒక్కమాటలో చెప్పాలంటే నిన్నటి తీపి- రేపటి ఆశల మధ్య వారధి అమ్మ.

అమ్మ ఆలనలో నా బ్రతుకు నిత్యహరితంగా గడిచిపోయేది. ఇక్కడికి వచ్చిన ఆమె సుఖపడాలి. ఇంతకాలం తమని సుఖపెట్టిన అమ్మ ఇక కష్టపడకూడదు..!'

- సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్న ధీరజ్ ఊహలు అమ్మతో తన అనుబంధాన్ని నెమరు వేసుకోసాగాయి.

• • •

"వరాలమ్మగారూ..! హనుమంతరావుకి పాము కరిచింది. నోటి నుండి నురగలు కక్కుతున్నాడు. చాలా భయంగా వుంది!" నాగమ్మ కేక విని, వంటింట్లో చేసుకుంటున్న పనులు వదిలేసి, కడుక్కున్న చేతుల్ని చీరకొంగుతో తుడుచుకుంటూ పరుగులాంటి నడకతో వెళ్లింది.

అతని పరిస్థితి చాలా సీరియస్‌గా వుంది. నోటి నుంచి నురగలతో... కాళ్లూచేతులు వశం తప్పి కొట్టుకుంటున్నాడు. శరీరంలో రంగులు మారుతున్నాయి.

హనుమంతరావుని చూసి అక్కడి ఆడవాళ్ళు, మగవాళ్ళు ఏడుపులు మొదలుపెడుతున్నారే గాని- చేయవలసిన పనులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆలోచించడం లేదు.

"నాగమ్మా! పాతగుడ్డ తీసుకురా..!" విషం శరీరమంతా వ్యాపించకుండా గాయానికి కట్టుకట్టి, డాక్టరుకి కబురుపెట్టింది.

వారందరికీ 'ఏమీ ఫరవాలేద'ని ధైర్యం చెబితేనే గాని, అక్కడి పరిస్థితి చక్కబడలేదు.

ఆరోజు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా అతన్నే గమనిస్తూ తగిన సూచనలిచ్చి అక్కడే గడపడంతో- పెద్ద గండం గడిచింది.

అమ్మ పరోపకారానికి ఎప్పుడూ ముందుంటుంది.

ఇంకా చెప్పాలంటే అమ్మ... అమ్మకి నేను, అక్కయ్య ఇద్దరు సంతానం. నాన్న చిన్నతనంలోనే కాలంచేయడంతో- మేము 'అమ్మా...' అని పిలిచినా, 'నాన్నా...' అని అరిచినా అమ్మ మాటే విన్పించేది. చెప్పిరాని అవసరాలు- ఆమె ఆదాయాన్ని నిలదీసి ప్రశ్నించినా చిరునవ్వుతో, పట్టుదల-ఓర్పులతో మేరుపర్వతంలా నిలిచి మమ్మల్ని పెంచి పెద్దజేసింది. తాతముత్తాత లిచ్చిన ఆస్థిపాస్తులేమీ లేకపోయినా- ఉక్కులాంటి అమ్మ క్రమశిక్షణ, మంచితనం, వ్యక్తిత్వం మాకు శ్రీరామరక్ష అయ్యాయి.

మేము పెద్దసంపన్నులం కాకపోయినా అమ్మ పోగుచేసుకున్న ప్రజల అభిమాన ధనరాశులే మాకు తరగని సంపద.

మా పుట్టిన పల్లె 'అగ్రహారం'లో అమ్మ మాటంటే అక్కడి వారందరికీ వేదవాక్కు! ఆ ఊరివారి పుట్టిన సంవత్సరం, తేదీల నుండి వారి జన్మనక్షత్రాల వివరాల వరకు అన్ని మంచిచెడ్డలు ఆమె నోటిమీద కదలాడుతుండేవి. కావాల్సిన వారు ఆవిడ నుండి వివరాలు అడిగి తెలుసుకునేవారు. ఆవిడను గ్రామపెద్ద మొదలు- పాలు పోసే గోపాలం దాకా... అందరూ 'మా ఊరి మదర్ థెరిస్సా' అని పిలవడం నాకు కొండంత తృప్తినిచ్చేది.

ఆ ఊరిలో ఎవరు ఏ పని మొదలుపెట్టాలన్నా మొదట అమ్మని చందా అడిగి తీసుకెళ్లేవారు. మొదటి నుండి అది వారి సెంటిమెంట్.

ఉగాది రోజు కంసాలి సూరన్న- "వరాలమ్మగారూ! ఈరోజు కనీసం చిన్నపని అయినా నాచేత చేయించాలి... అమ్మాయికి ముక్కుపుడక అయినా సరే! మీ హస్తవాసి మంచిది. అది నన్ను ఈ సంవత్సరకాలం చల్లగా చూస్తుంది!" అంటూ ఇంటికి వచ్చిన అతనికి ఎంతో కొంత ఇచ్చి పంపేది.

రైతులు పొలంలో నాట్లు వేసేటప్పుడు- అమ్మ వరం ఇస్తేనేగాని దుక్కి దున్నేవారు కాదు; నాట్లు వేసేవారు కాదు.

"నాన్నా ధీరూ! మీ తండ్రి లేకపోవడంతో చీమూ,నెత్తురు చంపుకొని... మగ పని, ఆడ పని నేనే చేసుకొని నిన్నూ, అక్కనీ పెంచి పెద్దజేశాను. నిన్ను పైచదువులకి పంపడానికి నాకు పెద్దగా ఆర్థికస్థోమత లేదు. ఏదో అక్కయ్యను ఓ అయ్య చేతిలో పెడితే నాకో పెద్ద బరువు తీరిపోతుంది. ఇక నువ్వు కష్టపడి చదువుకొని ప్రయోజకుడివైతే నన్ను ఒడ్డున పడేసిన వాడవవుతావు!" అమ్మ పడే వేదన నన్ను అప్పుడప్పుడు కలవరపరిచేది.

"లేదమ్మా! నీ నమ్మకాన్ని వమ్ము చేయను. నేను కష్టపడి శ్రద్ధగా చదువుకుంటాను. నీవనుకున్నట్లే మంచిమార్కులతో పాసై పెద్ద ఉద్యోగం సంపాదించుకుంటాను. వరహాలుగారబ్బాయి ప్రయోజకుడయ్యాడని అన్పించుకోవడం నా విధి. తరువాత మంచి సంబంధం చూసి అక్కయ్యకు పెళ్ళి చేద్దాం!"

నా మాటలు విన్న ఆవిడ కళ్ళల్లో కనిపించిన మెరుపు- నాకు ఎంతో మనోబలాన్ని ఇచ్చేది.

తల్లిదండ్రుల్ని కలిగివుండటం అనేది ఎంతో అదృష్టం. అందులోనూ తన తల్లిలా ప్రేమామృతం పంచియిస్తే మరీనూ!

నాకు జలుబు చేసి నాలుగు తుమ్ములు తుమ్మితే- ఆమె భూమి తలక్రిందు లయిపోయినట్లు హడావిడి చేస్తుంది. ఆ విధంగా మనల్ని గురించి ఆలోచించేవారు, ఆరాటపడేవారు ఉండటం అనేది నిజంగా అదృష్టం అనే చెప్పాలి.

ఆవిడ చేతితో ఇచ్చిన సొమ్ముల్ని తీసికెళ్లి కాలేజీ ఫీజు కడితే ఇక నాకు చదువులో తిరుగుండేది కాదు. అమ్మ ఇచ్చిన డబ్బుతో పరీక్ష ఫీజు కడితే మార్కులకు కొదవుండేది కాదు.

ఆ ఆప్యాయత... నా మనుగడకు మూలాధారం!

ఆ ఆలనకు, పాలనకు రూపమే... అమ్మ!!

మొత్తానికి ఆవిడ చల్లనిమనసు నన్ను ప్రయోజకునిగా తీర్చిదిద్దింది. తరువాత మా అగ్రహారీకుల సహకారంతో అక్కయ్యను ఓ అయ్య చేతిలో పెట్టడం జరిగిపోయింది.

చీరాలలో ఉద్యోగం రావడంతో- ఇక్కడ మంచిపొజిషన్‌లో స్థిరపడిపోయాను. నాకు నెలకు పదివేల రూపాయల జీతం.

'అమ్మ ఇక కష్టపడకూడదు. ఇంతకాలం అన్నీ తానే అయి అక్కనీ, నన్నూ పెంచింది. ఇకనుండి అన్నీ నేనే అయి ఆమెను సుఖపెట్టాలి. ఆమె నన్ను చూసి గర్వపడాలి.'

– కోరుకున్నట్లుగానే అమ్మను నా దగ్గరకు తెచ్చుకున్నాను.

ఉన్న ఊరిపై పెంచుకున్న మమకారాన్ని, ఆత్మీయతను వదలలేక అక్కడ నుండి నా దగ్గరకు వచ్చిన అమ్మ మొదట్లో అదోలా ఉండేది.

"ఎందుకు అలా నిరుత్సాహంగా ఉంటావు? సంతోషంగా ఉండు. నువ్వు ఉన్నది ఎక్కడో కాదు- కన్నకొడుకు దగ్గరే కదా!" రోజూ ఎంత బూస్టింగ్ ఇస్తున్నా అమ్మ ముఖంలో ఆ దిగులుని నివారించలేకపోయేవాణ్ణి. ఏదో కోల్పోయినట్లుండే ఆమెను సెలవురోజుల్లో గుళ్ళకీ, గోపురాలకీ తిప్పేవాణ్ణి. నలుగురికి పరిచయం చేసేవాణ్ణి. యాంత్రికంగా నన్ను అనుసరించేదే గాని, మునుపటి ఆ ఉత్సాహం ఆమెలో చూడలేకపోయేవాణ్ణి.

"అమ్మా! నేను చేసే ఉద్యోగంలో పైప్రమోషన్ కోసం డిపార్టుమెంటల్ టెస్ట్‌కి అప్లికేషన్ పంపుతున్నాను. చాలామంది నీవు మొదటగా ఇచ్చిన సొమ్ములతో జీవితంలో పైకివచ్చారు. నీ హస్తవాసి చాలా మంచిది. నీ చల్లని చేత్తో ఇచ్చిన ప్రతిపైసా ఇంతకు పదింతలై మమ్మల్ని కాపు కాస్తుందని నమ్మకం. కనుక నీ చేత్తో ఇచ్చిన సొమ్ములతో అప్లై చేస్తే నేను తప్పక సక్సెస్ అవుతాను!"

వరహాలు కొడుకు అన్నమాటలతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది. వెంటనే తన తాతలనాటి పెట్టె అడుగున దాచుకున్న సొమ్ముల్ని తీసి ఇస్తున్న ఆమె ముఖంలోని మెరుపును చూసిన నాకు- ఇంతకాలం నేను చేసిన తప్పు అర్థమయింది. అమ్మ వరం నాకు నిత్యమూ కావాలి. అది అడిగి తీసుకోకపోవడమే ఆమెలోని ఆ దిగులుకు కారణమయి వుంటుంది.

ఆ క్షణంలో నన్ను నేనే తిట్టుకున్నాను. ఇక ఆ తప్పు పునరావృతం కాకూడదని నిర్ణయించుకున్నాను.

"ఒరేయ్ ధీరూ! నా అంతట నేను గొప్పలు చెప్పుకోవడం కాదు గాని, మీ నాన్న కూడా ఏ పని చేసినా- నా హస్తవాసి మంచిదని మొదట నా చేతుల మీదుగా చేయించేవారు. ఆయన నమ్మకం ఎప్పుడూ వమ్ము కాలేదు. అలాగే మన అగ్రహారంలో అందరూ నన్ను తమ తోబుట్టువులా భావించి, ఆ అభిమానాన్ని కొనసాగించేవారు. అలాగే ఈ సొమ్ములు నీకు ప్రమోషన్ రావడానికి నాంది కావాలని ఆ శ్రీనివాసుని ప్రార్థిస్తున్నాను!"

"అమ్మా! నీ చల్లని ఆ దీవెన ప్రతిరోజూ నాకు కావాలి. నేను ఆఫీసుకు వెళ్లేముందు రోజూ నువ్వు నాకు ఎంతో కొంత సొమ్ము ఇవ్వాలి. అది రూపాయి అయినా, నాకు కోటిరూపాయల బలాన్నిస్తుంది!" నేను క్రియేట్ చేసిన ఆ సెంటిమెంట్‌కి ఆ అరవయ్యోపడిలోని ఆమె ఆనందంతో మునిగిపోయేది.

మనిషి సంఘంలో తన ఇన్వాల్వ్‌మెంట్‌ని కోరుకుంటాడు. తన ఇంపార్టెన్స్ ఉన్ననోట సంతృప్తిగా మనగలుగుతాడు. తద్వారా 'తాను ఆ పనిలో ఒక భాగస్వామి' అనే భావంతో అంకితమవుతాడు. లేకపోతే ఒకవిధమైన న్యూనతాభావంతో బాధపడతాడు.

అమ్మ విషయంలో జరిగిందదే!

ఆమెను ప్రోత్సహించి, బుజ్జగించి రోజూ ఆమె నుంచి ఒక రూపాయి తీసుకోవడంతో వృద్ధాప్యంలో కూడా కొడుక్కి తాను ఉపయోగపడుతున్నందుకు ఉప్పొంగిపోయేది. ఆవిడ దగ్గర సొమ్ములు నిండుకున్నప్పుడు ఆమెకు తెలియకుండా మరిన్ని రూపాయి కాసులు ఆమె పెట్టెలో పోసేవాణ్ణి.

మొత్తానికి అమ్మ చలవతో డిపార్టుమెంటల్ టెస్ట్ పాసై ప్రమోషన్ సంపాదించగలిగాను. ఆమె చేతిచలవతో ఇక్కడ ఒక స్థలం కొనగలిగాను. తరువాత– ఇంట్లో కలర్ టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, డబుల్ కాట్, స్కూటర్‌లు అమ్మ వరాలతో సంపాదించుకున్నాను.

"ధీరూ! ఇంట్లోకి కావాల్సినవన్నీ సంపాదించుకున్నావు. ఇక కోడల్ని కూడా సంపాదించుకుంటే ఆ బాధ్యత కూడా తీరిపోతుంది. నీకా పెళ్ళివయసు వచ్చింది. నాకు వయసు మళ్లుతోంది. ఇంటిపెత్తనం కోడలికి అప్పజెప్పి 'కృష్ణా! రామా!' అంటూ కూర్చోవాలని కోరిక!" అమ్మ మాట ప్రకారం ఆమె సెలెక్ట్ చేసిన 'హర్షిత'ను పెళ్ళిచేసుకున్నాను.

హర్షిత నా జీవితంలోకి ప్రవేశించిన తరువాత నాలో ఏదో మార్పు!

ఆమె కలవారి అమ్మాయి... మా మామగారు పెద్ద ఇండస్ట్రియలిస్ట్! ఆయనకు డబ్బు, హోదా, పలుకుబడులకు కొదవలేదు. అతిశయం పాలు ఎక్కువగల ఆమెకు నా ధోరణి, అమ్మ ధోరణి విపరీతంగా అన్పించేవి.

అమ్మను పొగుడుతూంటే ఎగతాళి చేసేది...

ఆవిడ హస్తవాసి గురించి చెబుతూంటే "అంతా ట్రాష్..!" అని కొట్టిపడేసేది.

"మన వ్యక్తిత్వం మనం సంపాదించుకున్నాం. తరువాత కూడా అన్నింటికీ 'పెద్దవాళ్ళ దయ' అని ఇతరుల మీద ఆధారపడటం చేతకానితనం క్రిందకి వస్తుంది. అలా మనగలగడం నాకిష్టం లేదు. నేను కంప్యూటర్స్ మీద ఎక్స్‌పర్టైజ్ చేశాను. కేవలం మీ ఉద్యోగంతో ఎంత సంపాదిస్తే మటుకు మన అవసరాలు తీరుతాయి? మీరు కొంత బ్యాంక్‌లోన్‌కి అప్లై చేస్తే, మా నాన్న నుండి కొంత సొమ్ము తీసుకువస్తాను. ఇక్కడ కంప్యూటర్ సెంటర్ స్టార్ట్ చేద్దాం!" హర్షిత ప్రపోజల్ నాలో కొత్తఆలోచనలకు నాంది అయింది.

అమ్మకి విషయం చెప్పాను...

ఆమె చాలా సంతోషిస్తుందని ఆశపడ్డాను.

"ధీరూ! నిన్ను నిరుత్సాహపరుస్తున్నానని భావించకు. బిజినెస్‌లో ఎన్నో ఒడిదొడుకులు ఉంటాయి. మీ తాతగారు ఇలాగే చేస్తూన్న ఉద్యోగాన్ని వదిలి ఏవో వ్యాపారాలంటూ తిరిగి చాలా నష్టపోయారు. నీకిప్పుడు ఏం లోటు చెప్పు? అత్యాశకు పోవద్దని నా కోరిక!"

ఆ క్షణంలో నేనూ, హర్షితా ఆవిడ ఎల్‌డర్లీ ఎడ్వైజ్‌ను అర్థంచేసుకోలేకపోయాము.

"బిజినెస్ గురించి నీకేం తెలుసమ్మా! ఈరోజు నా పిల్లలు చిన్నవాళ్ళు... రేపు పెరిగి పెద్దయిన తరువాత వచ్చే ఖర్చులకీ, నా రాబడికీ పొంతన కుదరదు. ఇప్పుడే నాలుగు రాళ్లు సంపాదిస్తే రేపు సమస్యలు ఉండవు!"

"అత్తగారు ఏదో పూర్వకాలం మనిషి. ఈ విషయాలన్నీ ఆవిడతో చెప్పేదేమిటి చెప్పండి! ముసలాళ్ళ ఆలోచనా దృక్పథాలు వేరుగా ఉంటాయి. వాటిని మనం పట్టించుకోనవసరం లేదు.

కాస్త తిండి పడేస్తే పిల్లల్ని చూసుకుంటూ ఓ మూల పడి ఉంటుందంతే!" హర్షిత అన్నమాటలు విన్న అమ్మ చాలా నొచ్చుకుంది.

అప్పటినుండి అమ్మపై ఒక్కోసారి నాకు తెలియకుండానే చికాకు పడేవాడిని. రోజూ అమ్మ రూపాయి వరం ఇస్తూంటే కళ్ళు మూసుకుపోయిన నేను ఆమెపై మండిపడేవాణ్ణి. బాధపడుతుందనే జ్ఞానం కూడా లేకుండా ఆవేశంతో మాటలు అనేవాణ్ణి.

అమ్మ అంతరంగసీమలో నాపట్ల అల్లుకున్న అనురాగ భావాలొక్కసారి పటాపంచ లవుతున్నాయని తెలుసు. కాని, నిస్సహాయత ఆ క్షణంలో నన్ను ఆవహించేది.

అనుబంధానికి అపూర్వమైన నిర్వచనం ఇవ్వవలసిన తరుణంలో పెడర్థాలకు స్థానం ఇవ్వవలసిన ప్రారబ్ధం కలగడం దురదృష్టకరం!

మొదట్లో- 'ఏదో అబ్బాయి ఒత్తిళ్ళతో చికాకుగా ఉన్నా'డనుకొని సరిపెట్టుకున్న అమ్మ- తరువాత వాస్తవాన్ని గ్రహించి తల్లడిల్లిపోయింది. పెళ్ళి అయిన తరువాత కోడలి హితబోధలతో తనని పట్టించుకోవడం మానేయడంతో ఆమె కలవరపడిపోయింది.

మా అభివృద్ధి కోసం భవిష్యత్తును హరివిల్లులా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అగ్రహారం విడిచివచ్చిన అమ్మమాట ఖాతరు లేకుండా పోయింది.

దానికి పూర్తి బాధ్యత నాది!

చివరికి ఎన్నో సంవత్సరాలు నా వెన్నంటివున్న అమ్మ- ఏదో వంకపెట్టి అక్కయ్య దగ్గరికి సామర్లకోట వెళ్ళిపోయింది. ఆరోజు కోపంతో నేనుగానీ, హర్షితగాని కనీసం స్టేషన్‌దాకా కూడా వెళ్ళకపోవడంతో- పనిఅమ్మాయి తోడు తీసుకోవలసి వచ్చింది. అమ్మను నేను బాధపెడుతున్నాననే గిల్టీనెస్ నన్ను వెంటాడుతున్నా- హర్షితవాళ్ళ నాన్న డామినేషన్ ప్రతిసారీ నన్ను అశక్తుణ్ణి చేసేది. నాది ఎవరి సలహాలు తీసుకునే స్వభావం కాకపోవడం, భార్యకు ఎదురుచెప్పలేని అలసత్వం, నాలోని అనామకత్వానికి తెరదీసింది. అప్పటినుండి అమ్మ ఎప్పుడైనా చీరాల వచ్చినా నామమాత్రంగా కొన్నిరోజులు గడిపి వెళ్ళిపోయేది.

చివరికి మామగారి ప్రోద్బలంతో కంప్యూటర్ సెంటర్ ఏర్పాటుచేసిన నాకు- డబ్బు సంపాదించాలనే యావ అధికమైంది. దానిలో పడినప్పుడు సాధారణంగా అది మనల్ని బానిసని చేస్తుంది. మనకి స్వేచ్ఛ లేకుండా పోతుంది. డబ్బు సంపాదన మొదట అవసరంగా మొదలై, చివరికి పోనుపోనూ ఒక వ్యసనంగా మారుతుంది. అప్పుడు 'ఇక బంధాలు, అనుబంధాలు అనేవి ఏమీ అవసరం లేదు' అన్పిస్తుంది.

చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి, రాత్రింబవళ్ళు కంప్యూటర్ సెంటర్ డెవలప్‌మెంట్ కోసం కృషి చేయడంతో- మా డిపార్టుమెంట్‌వాళ్ళు ఉద్యోగం చేస్తూ మరోవైపు బిజినెస్ స్టార్ట్ చేసినందుకు మెమో ఇచ్చి, పనిష్‌మెంట్‌గా నన్ను రాజమండ్రి బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత హర్షిత కంప్యూటర్ సెంటర్‌ని సరిగా మేనేజ్‌మెంట్ చేయలేకపోవడంతో భారీనష్టం వాటిల్లింది. చివరికి ఇనిస్టిట్యూట్ డిస్పోజ్ చేసే పరిస్థితి ఏర్పడింది.

వచ్చిన సొమ్ములలో మామగారు తాను పెట్టుబడి పెట్టిన డబ్బుని నిర్మొహమాటంగా తీసుకుపోవడంతో- మిగిలిన బ్యాంక్‌లోన్ క్లియర్ చేయడానికి నేను కొన్న స్థలం కూడా అమ్మవలసి వచ్చింది. ఈ సంఘటనతో నాతోబాటు హర్షిత కూడా కుమిలిపోయింది.

తిరోగమనం వైపు పయనిస్తున్న నాకు అమ్మ గుర్తుకువచ్చింది. చిన్నతనంలో ఊరివారిలాగే నేను కూడా సెంటిమెంట్ ఫీలయ్యేవాణ్ణి! కాని, పెరిగి పెద్దయిన తరువాత తల్లిని మెకానికల్‌గా తీసుకుని, పట్టించుకోవడం మానేసి పెద్దతప్పు చేశాను.

"మా నాన్న మనకు చేదోడువాదోడుగా ఉంటాడనుకున్నాను. కన్నకూతురనే అభిమానం కూడా లేకుండా తన సొమ్ముల్ని తీసుకుపోయాడు. ఆయన్ని 'నా తండ్రి' అని చెప్పుకునేందుకు చాలా సిగ్గుపడుతున్నాను. ఆయన అండ చూసుకొని దేవతలాంటి అత్తయ్యగారి మాట వినలేదు. ఆవిడ మనసు కష్టపెట్టి తల్లీకొడుకుల్ని విడదీశాను. నేను చేసిన ఈ తప్పు క్షమించరానిది. మరల అత్తయ్యగారు ఇక్కడికి వచ్చి మునుపటిలా మనతో కలిసివుంటేగాని నాకు మనశ్శాంతి లేదు. నేనే వెళ్లి ఆవిడ కాళ్లు పట్టుకొని, నా అవివేకాన్ని మన్నించమని కోరి పిలుచుకొస్తాను!" హర్షితలోని ఈ పరివర్తన నాలో సంతోషంతో పాటు కనువిప్పును కలుగజేశాయి.

అహంకారంతో తల్లిప్రేమను గుర్తించక మూసుకుపోయిన నా ఎద కవాటం మరల తెరచుకున్నట్లయింది. అది గ్రీష్మఋతువులో ఎండి, పగుళ్ళు బారిన నేలమీద పడిన స్వాతిచినుకుల సుగంధం లాంటిది.

మాలో మార్పుకు శుభసూచకంగా మా డిపార్టుమెంట్‌వాళ్ళు నన్ను క్షమించి మరల చీరాల బ్రాంచికి పోస్ట్ చేశారు.

• • •

అమ్మ లేకుండా ఆటో దిగి ఒంటరిగా వస్తున్న హర్షితను చూసి- నా మనసు నిరాశకు లోనైంది.

"అత్తగారిని తీసుకురావడానికి ఎంతో ప్రయత్నించాను. ఎన్నో విధాల ప్రాధేయపడ్డాను. మనం చేసిన తప్పుల్ని పెద్దమనసుతో క్షమించి నాతో రమ్మని కోరాను. కానీ, ఆవిడ అలవాటుపడ్డ వాతావరణాన్ని విడిచిపెట్టి రావడానికి ఇష్టపడలేదు.

'ఈ గాలి, నేల, నీరు, ఇంటిని విడిచి రావడానికి నా మనసు ఎందుకో ఒప్పుకోదమ్మా! ఈ వయసులో నేనెక్కడ ఉంటే ఏమిటి చెప్పు? నాకు ఏ రకమైన సహాయం కావాల్సివచ్చినా ఈ పల్లెతల్లి, గ్రామస్థులు ఉన్నారు. నేను ఇక్కడ ఉన్నప్పటికీ నా ఆశీర్వాదం మీకు ఎప్పుడూ ఉంటుంది. మీ ఉన్నతిని కోరుతూ ఉంటాను...' అన్నారావిడ!"

నాకు మటుకు అమ్మ వ్యక్తిత్వం హిమనగోన్నతమైన అంబరాన్ని అంటినట్లు అనిపిస్తోంది.